# మీనాక్షి నిరీక్షణ



కథానిక

మళ్ళీ కూతురు పుట్టింతోటే ఇంట్లో ఆనందం కల్గలేదు. ఏమీ తెలీని ఆనందు మాత్రం చెల్లాయి మంచంచుట్టూ గంతులేస్తున్నాడు. పద్మ చెల్లాయి మంచం వైపే రాకపోయింది: ఆమె అందాల చంద్రిక. నాన్నగారికి పద్మంటే ఎంతో మక్కువ. శాంతమ్మ గారాలపట్టిక. దాంతో భయంపోయి పెంకితనం ఇంకిపోయింది.

"ఒరేయ్ తమ్ముడూ! కాస్త సబ్బు తెచ్చి పెట్టు" అంటుంది పద్మ. "ఏడ్చావ్! చెల్లాయికి పాలు పట్టొద్దూ?" అంటాడు ఆనందు. "నల్లకుంకకి నీవు పట్టకపోతే — నీరసిస్తుందా, ఏమిటి?" ఇదీ రోజూ తగవు.

మీనాక్షి రోజురోజుకూ పెరుగుతూంది ఒలంగా. అక్కలాటి అందం లేకపోయినా, కురూపిమాత్రం కాదు. స్కూల్లో వేశారు. శ్రద్ధగా వెళ్తూంది. అన్నయ్యతో వెళ్తుంది బడికి.

పద్మ పండక్కి మొయ్యలేని నగలు పెట్టుకుంటుంది. వచ్చినబట్టలన్నీ కొంటుంది శాంతమ్మ. తేలిక సరుకు మీనాక్షికి.

మూడవఫారం తప్పి మూల కూర్చుంది పద్మ. ఆ తోటాకులమీద వనదేవతలా వుంది. వచ్చిన వాళ్ళంతా ఆ వయ్యారం చూసి ముగ్ధులయ్యారు. శాంతమ్మ మరుచటిదినంనుంచి గోలపెడ్తూనే వుంది, రామయ్యగారితో "స్థితికిమించైనా అందాల అల్లుణ్ణి తెమ్మని" "నేనూ అదే చూస్తున్నా" నన్నారు.

మీనాక్షి ఆరవతరగతిలోకి వచ్చింది. "ఇక చదువు చాలులే" అంది శాంతమ్మ. అందులో అక్క పెళ్ళి వస్తుంది పనులన్నీ నేను చావలే నంది. ససేమిరా చదువుతానంది. "చదువుతా నంటే నీకేమీ" అన్నాడు రామయ్యగారు. ఆనందు నాల్గవఫారంలో చేరేడు. ఆ సంవత్సరానికి పద్మ వివాహంకాలేదు. ఘనమైన సంబంధాలకోసం కాలయాపన జరుగుతూంది. శాంతమ్మ దిగులుగా కుంగిపోతూంది.

ఇంట్లో పనులన్నీ చేసిగాని మీనాక్షి బడికి వెళ్ళడానికి వీలులేదు. అది శాంతమ్మగారి ఆజ్ఞ. కూరగాయలు తరుగుతూనే చదువుతూంది. అమ్మరాగానే వడిలో దాచుకుంటుంది పుస్తకం.

వేసవికాలం వచ్చింది. మీనాక్షి మంచి మార్కులతో పరీక్షయింది. ఆనందు ప్యాసైయ్యాడు. పట్టణంలో పద్మకు అనువైనసంబంధం కుదిరింది. వైభవంగా వివాహం జరిగింది. వియ్యంకుడిగారింటికి అందరూ వెళ్ళారు మీనాక్షిని యింట్లో వుంచి. అమ్మావాళ్లు వెళ్ళేప్పుడు దిక్కుమోహం వేసి "నేను వస్తా" నంది. చీర సవరించుకుంటూ కారులో అడుగుపెట్టి "ఏమిటి నీ మొఖం మూడు రోజులలో వస్తాంగా?" అంది శాంతమ్మ. ఆనందు ఆది "చెల్లెకి నేనుతోడుంటా" నన్నాడు "మొగ నలుసువు నీ వొక్కడివి కూడా రాకపోతే ఎలారా? అంటూ కారు పోనియ్యమంది. ఆ రోజు ఎంత ఏడ్చిందో ఎవరికీ తెలియదు, పనిమనిషి కాంతానికి తప్ప,

దండమూడి బాలగంగాధరరావు

అది ఓదార్చింది. బుద్ధిగలది గనక విన్నది.

వారం రోజులలో అంతా వచ్చారు అల్లుడితో సహా. అల్లుడికి అందించవలసినవి, అమర్చవలసినవి అన్నీ మీనాక్షికే పురమాయించారు. అతను అప్పుడప్పుడు మరదలితో ఛలోక్తిగా మాట్లాడ తాడు. తలుపు సందునుంచి పద్మ పళ్లు నూరి "ఏమిటా తేలగుడ్లు? పలకరిస్తే నిలబడాలేమిటి వెర్రిమొగమా పనులు చూసుకో" అంటూ కసురు కొంటుంది. తెల్ల మొగం వేసి యిల్లు సర్ది బళ్లోకి వెళ్తుంది.

ఆ సంవత్సరం సంక్రాంతి పండుక్కి బావ య్యను తీసుకురమ్మని ఆనందుని పట్టణం పం పారు. ఆ వెళ్లటం వెళ్లటం మిలటరీలోకి పారి పోయాడు. రెండు రోజులు మెతుకు ముట్టలేదు మీనాక్షి. ఇంటిల్లిపాది గోల పెట్టారు.

ఇప్పుడు మీనాక్షి నాల్గవ ఫారంలో చేరింది. చేరేటప్పుడు శాంతమ్మ గోల పెడుతూనే వుంది, "చదువు చట్టుబండలు కాను! యిక మానవే" అని.

"పనులన్నీ చేసే వెళ్తున్నా గదే?" అంటూ దీనంగా అడిగింది మీనాక్షి. అంతలో ఆనందు పూనాలో సైన్యంలో వుంటున్నానని మంచి జీతం యిస్తున్నారని, వందరూపాయిలు పంపుతూ యిలా అప్పుడప్పుడూ పంపుతానని మీనాక్షిని మాత్రం చదివినంతవరకు చదివించమని మరీమరీ వ్రాశాడు. దాంతో శాంతమ్మ ఏమీ అనలేక పోయింది.

అప్పుడే శాంతమ్మ తమ్ముడికొడుకు చదువుకని మేనత్తగారింటికి వచ్చాడు. వాళ్ళ వూళ్ళో "మిడిల్ స్కూల్" వరకే వుంది. యిప్పుడతను మీనాక్షి క్లాసు. అందువల్ల రావటమైంది.

శాంతమ్మ తమ్ముడికొడుకుని బాగా నే చూసేది. అతనికి మాత్రం యిక్కడ బిక్కుబిక్కు మంటూ ఉండేది. మీనాక్షితో మాట్లాడే వాడుగాదు. ఆ అమ్మాయికూడా తప్పుకు తప్పుకు తిరిగేది. రామయ్యగారు అప్పుడప్పుడు "గోపాలం! బాగా చదవాలి సుమా" అంటూ వుండేవారు.

అతనికిప్పుడు బెంగపోయింది. పిల్లలందరూ స్నేహమయినారు. వాళ్లు మీనాక్షిని చూపించి "నీ పెళ్లాం" అంటూండేవారు గోపాలం నవ్వి పూరుకునేవాడు. మీనాక్షి మొఖం చిట్లించుకుని లోపలికి వెళ్ళిపోయేది.

గోపాలానికి, మలేరియా జ్వరం ఎప్పుడూ వస్తుండేది. అదివరకే అంకురమైంది. యీ వూరు నీరు సరిపడక మరీవస్తూండేది. ఆ జ్వరంలో విప రీతంగా పలవరించేవాడు. సపర్య అంతా మీనాక్షి చూడవలసిందే. శాంతమ్మ వాలు కుర్చీలో పడుకుని పద్మకు జాకట్లు తయారు చేయటంలో సరిపోయ్యేది కాలం.

దసరాశెలవులలో గోపాలం యింటికి వెళ్లాడు. మీనాక్షి పెద్దమనిషి అయింది. ఆ సంగతి వూళ్లో ఎవరికీ పెద్దగా తెలియదేమో. తిరిగి రాగానే గోపాలానికి కనిపించడమే మానింది మీనాక్షి.

ఒకరోజు జ్వరం తీవ్రరంగా వచ్చిందతనికి. చలి జాస్తి అయింది. శాంతమ్మ విసుక్కుంది మీనాక్షిని, "తప్పుకు తిరక్కపోతే కాస్త దుప్పటి కప్పరాదా? వాడు పరాయివాడా?" బిడియంతో వెళ్ళివత్తుగా దుప్పటి కప్పింది. ఇంట్లో పనులన్ని చూసి చదువు మొదలెట్టింది.

ఆసంవత్సరం పరీక్షలైఫలితాలొచ్చాయి. మీనాక్షి మంచి మార్కులతో పాసైయింది. గోపాలం చాలా తక్కువ మార్కులతో పాసై య్యాడు.

మళ్ళీ స్కూలు తెరిచారు. రామారావు అనే పారుగూరి కుర్రవాడు వీళ్ళింటిప్రక్కదే ఇల్లుకాని ముసలమ్మతో వండించుకుంటూ స్కూల్ ఫైనల్లో జేరాడు. మంచి తెలివైనవాడు, అందమైనవాడు. స్కూలులో అందరినీ ఆకర్షిం చేవాడు. చివరికి నాయకుడుగా ఎన్నికయినాడు. మీనాక్షి మెంబరుగావచ్చిందట. అందుకు తల్లి నానాతిట్లు తిట్టింది. పర్యవసానంగా రెండు రోజులు వుపవాసం చేయవలసి వచ్చింది.

రామారావుకి గోపాలాని మంచి స్నేహం ఏర్పడి రోజూ గోపాలం కోసం వస్తూండేవాడు. అప్పుడప్పుడు ఒకచోట చదువుతూండేవారు. ఒక రోజు రామారావు గోపాలం స్కూలులో రాజ కీయాలు గూర్చి చర్చించుతూంటే మీనాక్షి ఇంట్లో పనులుముగించి తలుపుదగ్గర నుంచుని వింటూంది. అంతలో శాంతమ్మవచ్చి వాళ్ళ

ముందు నానామాట్లాడింది మీనాక్షిని. దానితో ఎప్పుడూ అలా వెళ్ళేదికాదు మీనాక్షి.

మీనాక్షిలో పూర్తియవ్వనం వికసించింది. కాని శాంతిలేదు. ఇంట్లో పాలేరుకన్న నీచంగా చూస్తున్నారు తనని, ఎన్నో రాత్రుళ్లు తన బ్రతుకును గూర్చి ఏడ్చి ఏడ్చి నిదురపోయేది. అక్క అదృష్టంతో తనస్థితి పోల్చుకునేది. తను చేసిన పాపమేమిటి? పనులన్నీ నౌకరుకన్న మిన్నగా చేస్తూ చదువుతున్నా తనంత నీచంగా చూస్తారేమిటో? అర్థం అగమ్యం. తనెరుగున్నాక ఒక సారన్నా అమ్మతో సంతోషంగా పిలిపించుకొని యెరుగదు. అన్నయ్య వుంటే ఎంత బాగుండేది! నాన్న ఎందుకూ పనికిరాని అసమర్థుడు. అమ్మ చేతిలో కీలుబొమ్మ.

చదువుకుందామని బాగా వుంది. ఆ అదృష్టం వుండొద్దూ? స్కూలు ఫైనల్ వరకే, తరువాత చదివించరు. అది ఖాయం.

పొంగిన యౌవనం ప్రేమకోసం ఆరాట పడ సాగింది. రామారావు ఎంత మంచివాడు! రూపసి కూడా. తనంటే ఎంత ప్రేమ! తనివితీరా తనను చూస్తాడు. తనకెంతో సిగ్గువేస్తుంది-ఛీ! పాడు వూహాలు తనకంత అదృష్టమా? నిద్రపోయినది నిశీథి రాత్రులు చూస్తూ, కోర్కెలతో మిగులుతూ.

మరునాడు స్కూలుకు వెళ్లింది పనులన్నీ చేసి. వున్నవాటిలో మంచిబట్టలు వేసుకొంది. సాయంకాలం "డిబేటింగు" వుంది. రామారావు మాట్లాడతాడు. తనకు వినాలని వుంది. ఆలస్యమయితే అమ్మ కోపగించునని తెలుసు. అయినా అంతర్లీనంలోని కోర్కెలకు దాసురాలై ఆగిపోయింది.

సమావేశం ప్రారంభమయింది. రామారావు క్రీగంటితో మీనాక్షివైపు చూశాడు. దీర్ఘోపన్యాసము సాగించాడు. సిగ్గుతో మీనాక్షి తల దింపుకుంది. అంతా కనిపెట్టారు. అతను మాట్లాడిన ప్రతి వాక్కు ఆమె హృదయంలో నిలిచిపోయినది. తను మాట్లాడా లనుకొంది. మాట్లాడలేక పోయింది. మాట్లాడమన్నారు. మాట్లాడలేనంది. కొంతసేపటికి అయిపోయింది అంతా లేచారు. ఆ అమ్మాయిమాత్రం అలానేకూర్చుంది చాలాసేపు కూర్చుంది. మళ్ళీ యీ లోకంలోకి వచ్చి చూసేసరికి ఎవరూ లేరు. ఆశ్చర్యపోయింది.

రామారావు స్నేహితుని పంపి మీనాక్షి యింకా యింటికి వెళ్ళలేదామా యని ఇలా వచ్చాడు. అతనిని చూచి చప్పున లేచింది. క్షణంసేపు యిద్దరూ మాట్లాడలేకపోయారు. అప్రయత్నంగా అతను ఆ అమ్మాయిదగ్గరకు వెళ్లి చెయ్యిపట్టుకొన్నాడు. "తప్పు!" అని అవతలకు తప్పుకుంది. మళ్ళీ పట్టుకుబోయేటప్పటికి యెవ్వరో కుర్రాడి శబ్దం వినిపించి ఆగిపోయాడు. ఆ కుర్రాడు చూచాడు. నివ్వెరపోయి ఎవరి యింటికి వాళ్లు వెళ్లిపోయారు. మరునాడు స్కూలంతా పాక్కింది. వూరంతా అల్లరైంది. శాంతమ్మదాకా వచ్చింది. అగ్నిపర్వతం మీదపడింది. ఆ ఘాటు పొగలకు తట్టుకోలేక అమాయకంగా తల్లి పాదాలపై బడి బోరుబోరున ఏడ్చింది. ప్రపంచమంతా పచ్చదనంపోయి మసగ్గా, నల్లగా అగుపించింది. లోలోన కుమిలి మనిషి డొక్కుపోయి పీక్కుపోయింది. ప్రాణం త్యజించుదామనుకుంది. సాహసించేటప్పటికి అధైర్యం ఆవరించి బ్రతుకు భారంగా యీడుస్తోంది.

రామారావుకు పరీక్ష ప్రారంభమైనాయ్. గోపాలం జతకి రావటమే మానేశాడు. శ్రద్ధలో చదివాడు. పరీక్ష లవ్వగానే ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఎంతగా ఏడ్చిందో, ఎవ్వరికీ తెలియదు. అర్థంగాని బాధ వ్యర్థమై పారింది.

తనకు పరీక్షలు మొదలెట్టారు. గోపాలానికి బాగా జబ్బు చేసింది. చాకిరీ అంతా తనే. ఇంట్లో మిగతా పనులూ తనవే. ఐనా పట్టుదలతో చదివింది.

అందరి ఫలితాలు వచ్చాయ్. తను ఓ మోస్తరు మార్కులతో నెగ్గింది. పూర్వపు మార్కులను బట్టి గోపాలం పరీక్షయ్యాడు. రామారావు పట్నం వెళ్ళి కాలేజీలో చేరాడట.

స్కూలు తెరచారు. తనకు పెద్ద జబ్బు చేసింది. ప్రమాదం కూడా చేసింది. అయినా తల్లి శ్రద్ధగా చూసేదికాదు. మందులవీ గోపాలం తెచ్చేవాడు. నిద్రలో కలవరింతలు పెట్టేది అన్నయ్యను కూర్చి. చాలా రోజులైంది తేరుకునేప్పటికి. అప్పటికే స్కూల్లో పాఠాలు మొదలెట్టారు. ఇంట్లో వద్దన్నా, స్కూలుకు వెళ్తుంది.

మళ్ళీ గోపాలం మొదటికొచ్చాడు. అలాగే, అతనికి సహాయం చేస్తుంది. పాపం, అతనిమీద జాలివేసింది. "మంచివాడికి జబ్బులేమిటో?" అని వగచింది. పలకరించితే, మనసిచ్చి మాట్లాడేవాడు. ఎంత మంచిహృదయం! ఎంత నమ్రత! తననేమీ పనిచేయనిచ్చేవాడు కాదు. ఆ చలిలో తనే దుప్పటి కప్పుకునేవాడు. కప్పబోతే, ఒప్పుకునేవాడు కాదు. అతనికి అనేకవిధాల సహాయం చెయ్యాలనుకునేది. ఎందుకో తనకి తెలియదు. లెక్కలు చెప్పేవి, మంచంమీదే. పాఠాలు చదివి వినిపించేది. శాంతమ్మకూడా చదవమనేది.

సంక్రాంతిపండుగ వెళ్ళిపోయింది. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయ్. అతడారోగ్యం మరీ జారిపోతూంది. అంతలో మద్రాస్‌నుంచి 'టెలిగ్రామ్' వచ్చింది—"పద్మకి గర్భిణిపోయి ప్రమాదంలో వుందని"——ఆ రాత్రిబండికే బయల్దేరింది శాంతమ్మ, భర్తతో. గోపాలం అస్వస్థతను చూచి సందేహించాడు రామయ్యగారు. అందులో వయస్సువచ్చిన కూతుర్ని ఇంట్లో ఒంటరిగా ఒదలి వెళ్లడం ఎలాగా అని ఆలోచించాడు. "దానికేం ఫర్వాలేదు, గోపాలం వుండనే వుంటాడుగా" అంటూ కసురుకుంది ఆలస్యానికి. గోపాలంకూడా తనకు కొంచెంపీలుగానే వుందని ప్రయాణం కమ్మన్నాడు. ఆ రాత్రిబండికే వెళ్ళిపోయారు.

అమ్మా, నాన్న వెళ్లిపోగానే, రాత్రికి గోపాలానికి జ్వరం, చలి తీవ్రత హెచ్చాయ్. వండిన అన్నం కుండనిండావుంది. తనూ తినలేదు. తలుపులన్నీ వేసి, అతనికి దుప్పటి వత్తుగాకప్పింది. ఒకప్రక్క అక్కగుర్తుకు వస్తూంది. మరోవైపు గోపాలం బాధచూడలేక పోతూంది. ఇది మరింత మనస్సుని వ్యాకులపరుస్తూంది. తనకెంతో సంబంధం వున్నట్లు హృదయం ఆరాటపడుతోంది. దైవాన్ని వేడుకుంది. అతడు మంచి బాధలో వున్నాడు. కట్టుకట్టిన తన గాథంతా అతనికి చెప్పుకుని, బాధను తీర్చుకుందామనిపిస్తూంది. చెప్పుకోలేకపోతే తాను ఆపుకోలేనట్లుంది. అతను ఓదార్చితే...?ఛీ..! తనంత అదృష్టవంతురాలా? తన జీవితం అటువంటి మధుర సోపానాలను తాకుతుందా? జబ్బు చేస్తేమట్టుకేం, గోపాలం బుద్ధి బృహస్పతి సాటిది! అతడు ముమ్మాటికీ సుగంధమే! ఆ వాసనలు చాలవూ, తనకి? వాటికోసం తన జీవితం అతని పాదాలకు అంకితం చెయ్యదూ? తనంత అదృష్టవంతురాలా? అనుకుంది.

నిశీధరాత్రి. నిర్మానుష్యం. శాంతి ఘోషిస్తోంది. చల్లనిగాలి వీస్తూంది. మందంగా గోపాలానికి జ్వరం తగ్గింది. కొద్దిగా వుడకపోయ మొదలెట్టింది. మెలుకువవచ్చి కాళ్ళు చాపేటప్పటికి గట్టిగా తగిలింది. లేచాడు. మీనాక్షిని చూచి అచ్చెరువుచెందాడు. ఆమె ఋణం ఎలా తీర్చుకుందామా అని బాధపడ్డాడు.

నెమ్మదిగా లేపాడు. క్షమించమని ప్రాధేయపడ్డాడు. "ఛీ! ఆవేమిమాటలు" అంది. అలాఅని బాధపెట్టవద్దని మందలించింది, నయనంగా. ఆమెలోని గంభీరం గగుర్పొడిచింది గోపాలాన్ని. ఉశ్వాస నిశ్వాసలు భారంగా తీస్తూంది. నిండుగా వుందామె వాలకం.

ఆమెలేచి అతన్ని మంచంమీద పరుండబెట్టింది. నివ్వెరపోయాడు. నిద్రరావటల్లేదన్నాడు. చిన్నపిల్లడిలాగు మాట్లాడుతున్నాడు. "నిద్రపోకపోతే—నీరసం ఒస్తుంది — నిద్రపో గోపాలం" అంది బాధ్యతకల వ్యక్తిలా. ఆమె ముఖంలో కొన్నివేల భావాలు ప్రవహిస్తున్నాయి అనుకున్నాడు. ఓ మహాపవిత్రాత్మక శక్తిముందు పడుకుని వున్నానని అనిపించింది, అతని కాసమయంలో!

"ఏమిటలావున్నావ్ మీనాక్షీ?... అంతా వింతగావుంది...!" మాటలు తడుముకుంటూ అన్నాడు. "ఏమీలేదు పడుకో" అంటూ దుప్పటి కప్పబోగా వారించి "నాకు నిద్రరావడంలేదులే... ఇంతకీ ఏమిటలావున్నావ్? నిన్నుచూస్తూంటే భయంవేస్తూంది" అన్నాడు.

"నన్నుచూచి నాకే భయమేస్తుంది; నావంటి వ్యక్తులు ఎవరన్నా వున్నారా అని."

"అదేమిటి మీనాక్షీ! అలా అంటున్నావ్? నిన్నుగూర్చి నాకేదో తెల్సుకోవాలనిపిస్తుంది- చెప్పవూ?" అని బ్రతిమాలినట్లు అడిగాడు.

"నీ అనురాగానికి నా హృదయపూర్వక వందనములు" అతని చేతులు దగ్గరకుతీసికుంటూ చెక్కి—

ళ్ళకు అద్ది "నాకూ చెప్పాలనివుంది గోపాలం" అంటూ బోరున ఏడ్చింది.

అతని లేతహృదయం విప్పారింది. శరీరం గగుర్పొడిచింది. తనిప్పుడు అంధకారంలో చూస్తున్నాడు. జాలిగా "చెప్పవూ?" అన్నాడు అప్రయత్నంగా. ఎందుకన్నాడో తనకు తెలీదు.

"ఏమిచెప్పను గోపాలం!" ఆ గంభీరత్వాన్ని చూడలేకపోయాడు. ఇంతవరకూ సుఖమనేది ఎరగను గోపాలం. ఒక్కసారన్నా, కన్న తల్లిదండ్రులతో ముద్దుగా పిలిపించుకు ఎరగను, చూస్తున్నావుగా. ఎంతగా కృశించిపోతున్నానో పరమాత్మకు తెలియాలి. చివరికి నైతికంగా నాశనమౌతానేమోననే భయం వుంది" పెదాలు కొరుక్కుంటూ దుఃఖాన్ని ఆపుకుంటూంది.

"ఛీ, వూరుకో" అని సముదాయించాడు. కొంచెంసేపు నిశ్శబ్దం ఆవరించింది. అతనేమీ మాట్లాడలేకపోయాడు.

ఒక్కసారి పిడుగుపడ్డట్లు "ఏమో అనుమానంగావుంది గోపాలం...నీ...తో...ఎక్కడికో వెళ్ళిపోవాలనీ, హాయిగా జీవించాలనీ వుంది, ఎందుకో. క్షమించవూ? నాకా అదృష్టముందా?" అంటూ పాదాలుపట్టుకుంది, ప్రాధేయపూర్వకంగా.

నిశ్చేష్టుడైనాడు. అతనిప్పుడు ఎక్కడుండాడో, ఎవ్వరితో మాట్లాడుతున్నాడో కూడా. తెలియటంలా. "మీనాక్షితో తనకు వివాహమా? ఎప్పుడూ తనకా ఆలోచనన్నా లేదే! కలలో కూడా తలవనేలేదే? ఐనా తనంత సమర్థుడా? నిరంతరం అనారోగ్యం నీరధిలో ఘోషిస్తుందే? చదువుకూడా అంతంతమాత్రం. మీనాక్షి ఆరోగ్యంకలది, చదువులో చురుకైనదీ కూడా! తనకు ఆశ్చర్యమేసింది; ఐనా తనేమి సుఖపెట్టగలడు? శాంతమ్మత్తయ్య ఏమన్నా అనుకోదూ?

అలా అనుకుంటూనే ఆ నిశ్శబ్దతలోంచి ఓ మెరుపులాంటి అనుమానం నెట్టుకొచ్చింది నోరుజారి "ఒక విషయం"అన్నాడు. చివుక్కుమనిపించింది తనకే ఎందుకన్నానా అని. ఇక నిలద్రొక్కుకోటం మొదలెట్టాడు. "ఏమిటి?"అంటూ జాలిగా అడిగింది. తను తప్పు చేశానని తెలుసు; ఐనా తప్పదుగా. తలవంచుకు కూర్చుంది.

"రామారావు విషయం"అనగల్గాడు బలవంతం మీద.

"అవును. ప్రేమించాను, నిజమే. నీముందు అబద్ధం ఆడలేను. నా హృదయం ఒప్పుకోదు. కాని, అప్పుడు ఎలా ప్రేమించానో, అలాగే అంతమైంది. ఇప్పుడు గుర్తేలేదు. ఐనా నిన్నెలా నమ్మించగలను?" అంటూ అతని ముఖం చూచింది అధైర్యంగా. తృప్తిగా కనిపించలేదు. అతనిముఖం చూస్తే "నమ్మలేను" అన్నట్లు తనకు వినిపించింది నిజంగా అతనేమీ అనలేదు.

దిగజారిపోతూంది నూతిలోకి ఎక్కడన్నా ఒక రాయిగాని, కనీసం గడ్డిపరకగాని అందితే పట్టుకోటానికి ప్రయత్నంలా తహతహలాడుతూ, అనునయంగా "ప్రేమ, ప్రపంచం అంటే తెలియని వాతావరణంలో పెరిగాను గోపాలం. ఏది దొరికితే అది తిన్నట్లు, ఏమిటో తెలియటం లేదు, క్షమించవూ? జీవితంలోనే చేసిందీ— నిన్ను మోసగించిందీ అదొక్కటే ముమ్మాటికీ, భగవంతుడి తోడుగా, ఫలితంగా నీకు ఆ జన్మాంతం సేవకురాలిగా వుంటాను. నన్ను తీసుకో నీలోకి. నువ్వుకూడా తృణీకరించావా, నే నెందర్ని నమ్మవలసొస్తుందో - ఎన్ని అవమానాలకు గురికావలసి వస్తుందో—నా అదృష్టంమీద ఆధారపడి వుంది...నీ దయకు పాత్రురా"లనంటూ నమస్కరించింది.

గోపాలంకి ఈ ప్రవర్తన ఆశ్చర్యపరచింది. అర్థంచేసుకో గల్గాడు. ఈమెను తనదానిగా చేసుకోవాలనుకున్నాడు. ముద్దుగా ఆమెచేతులు, సున్నితంగా నొక్కాడు. ఆమె హృదయం వికసించింది. నయనాలు రెపరెప లాడినయ్. సిగ్గుతో చెమటపట్టింది. ఆ క్షణంలో ఆమె పొందిన అనుభూతి అతని సానుభూతికి లయ కల్పింది. మెలికలు తిరిగింది. ఉషస్సులోంచి ఇద్దరూ మేల్కొన్నారు.

వేసంగిలో అన్నయ్యవచ్చాడు, శెలవు పెట్టి. వింతసామానులు తెచ్చాడు. ఆ అన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన తన వివాహం ఆమెకు అతి వైభవంగావుంది. రెక్కలువచ్చిన పక్షిలా, నింగి గర్వంతో ఎగిరిపోయింది - గోపాలాన్ని అనుసరిస్తూ—

★